## క్లుప్తంగా

### మోసగాళ్లతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్‌ఐ

డోన్: మాయమాటలతో మోసం చేసే వారిపై విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని ప్యాపిలి ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. ప్యాపిలి కేజీబీవీలో సోమవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థినులు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిచయం లేని వారు ఇచ్చే తినుబండారాలు తీనకూడదన్నారు. క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూనే చదువుపై దృష్టి సారించాలని తెలిపారు.

### ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న జలదుర్గం ఎస్‌ఐ

డోన్: వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున అన్నారు. స్థానిక జలదుర్గం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు తప్పకుండా ఉండాలన్నారు.

### ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో మాఘ మాసం సోమవారం సందర్భంగా శివమాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రూప్ దేవాలయాల మాజీ చైర్మన్ గుండా జగన్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

### సీసీరోడ్ల నిర్మాణ పనుల తనిఖీ



కైప గ్రామంలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: మండలంలోని కైప గ్రామంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

### కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు



అలంకరణలో కాశిరెడ్డినాయన విగ్రహం

డోన్: మండలంలోని ఓబులాపురం మెట్ట వద్దనున్న కాశిరెడ్డినాయన ఆశ్రమ 20వ ఆరాధన ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేసి కాశిరెడ్డినాయన విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా గుండుపందెం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఆర్‌ఈ రాజవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు.

### రేపు ఎడ్ల బండలాగుడు పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామంలో వెలసిన కాశీ విశాలక్షి, విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఈనెల 12వ తేదీ నాలుగు పండ్ల ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ. 3వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

# ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

- ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- పిల్లలకు మాత్రల పంపిణీ





కొలిమిగుండ్ల: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి మాత్ర వేస్తున్న మెడికల్ ఆఫీసర్, బనగానపల్లె: చిన్నారికి మాత్ర మింగిస్తున్న మెడికల్ ఆఫీసర్

బనగానపల్లె: అల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని పలుకూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మోనిక అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 3 నుంచి 19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. అపరిశుభ్రత వల్లే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయన్నారు. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలుషిత ఆహారం తీసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించి హాని చేస్తాయని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు వాడడం వల్ల కడుపులోని నులిపురుగులు తగ్గిపోతాయని పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 19642 మందికి గాను 18968 మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు వెల్లడించారు.

### వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

బేతంచెర్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు హెచ్ఎం అబ్రహ్మం, వైద్యురాలు తస్లీమా భాను ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. సీతారామాపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వాజిదున్నిసాబీబీ, ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శేషయ్య విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

### పరిశుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం

డోన్ టౌన్: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చెన్నకేశవులు అన్నారు. సోమవారం డోన్ సమీపంలోని కస్తూర్బా పాఠశాల, బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల సంక్రమణపై అవగాహన కల్పించారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. నులిపురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపు నొప్పి, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు మింగాలన్నారు. అలాగే పాతపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం వెంట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ స్థానిక కొత్తపేట గరల్స్ హైస్కూల్‌లో మాత్రల పంపిణీ చేశారు.

### ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

కొలిమిగుండ్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 9050 మంది పిల్లలు ఉన్నారన్నారు. మొదటి రోజే ఎక్కువ శాతం పిల్లకు మాత్రలు అందించామని.. మిగిలిపోయిన వారికి ఈనెల 17న వేస్తామని చెప్పారు. దుమ్ము,ధూళి పడిన పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

### ప్యాపిలి మండలంలో 95.88 శాతం పంపిణీ

డోన్: ప్యాపిలి మండల పరిధిలోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఏనుగుమర్రి, కేజీబీవీ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్ పాల్గొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసిందన్నారు. మండలంలో మొత్తం 95.88 శాతం పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు.

### నులిపురుగును నలిపేద్దాం

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులతో పాటు బడి బయటి పిల్లలకు మాత్రలు వేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి పాల్గొన్నారు.



డోన్: పాతపేట హైస్కూల్‌లో..



ప్యాపిలిలో..



కోవెలకుంట్లలో..



బేతంచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో..

### శివపార్వతుల పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 12న పుట్ట పెద్దమ్మకు బోనాలు



పుట్ట పెద్దమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మ ఆలయంలో ఈ నెల 12వ తేదీ మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ తెలిపారు. పూల రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి పాతసంత కూరగాయల మార్కెట్ నుంచి బోయపేట, సంజీవనగర్ రైల్వే గేటు మీదుగా ఆలయం వరకు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### మురుగునీటితో అవస్థలు

డోన్: స్థానిక కొత్త బస్టాండ్ వెనుక ప్రాంతంలో మురుగునీరు నిల్వ చేరడంతో ఆ ప్రాంతం వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మురుగునీటిలో చెత్త, చెదారం చేరి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇదే ప్రాంతంలో విద్యుత్ లైన్ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ సౌకర్యాన్ని కల్పించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



ఆర్టీసీ కొత్త బస్టాండ్ వెనుక ప్రాంతంలో పేరుకుపోయిన మురుగు

### ఆశ్రమ పాఠశాలకు బోరు సౌకర్యం

డోన్: ప్యాపిలి మండల పరిధిలోని సీతమ్మతండా ఆశ్రమ పాఠశాలకు డోన్ ట్రెజరీ ఉద్యోగి లక్ష్మణ్ నాయక్ బోర్ సౌకర్యం కల్పించారు. ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న లక్ష్మణ్ నాయక్ రూ. 1.3 లక్షలు వెచ్చించి సొంతంగా బోర్ వేయించారు. బోర్‌లో ఒక ఇంచు నీళ్లు పడినట్లు లక్ష్మణ్ నాయక్ తెలిపారు. పాఠశాలకు బోర్ వేయించడంపై పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

డోన్: అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం డోన్ మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పేదలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి మోటారాముడు, మండల కార్యదర్శి నారాయణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

### ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

బేతంచెర్ల: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని శేషారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక, వైద్యురాలు వాణి స్వప్న ప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు దాతలు వల్లెల రామకోటేశ్వర్‌రెడ్డి, రాధా స్వప్న సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవికుమార్, హరి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

# భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం



హెచ్‌కొట్టాల రైతులతో మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ

బేతంచెర్ల: రైల్వే అండర్ బ్రిడ్జి పనుల్లో భూములు కోల్పోతున్న రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని డోన్ ఆర్డీఓ నరసింహులు అన్నారు. బేతంచెర్ల మండలం హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో నిర్మించనున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కోసం 2.85 ఎకరాల భూమిని కోల్పోతున్న 21 మంది రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. నష్ట పరిహారం చెల్లింపులకు సంబంధించి తహసీల్దార్ ప్రకాశ్‌బాబుతో కలిసి రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎకరాకు రూ.15 లక్షల వరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నష్టపరిహారం పెంచాలనే రైతుల అభిప్రాయాన్ని కలెక్టర్, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్‌ఐ హేమంత్‌రెడ్డి, వీఆర్వో విజయలక్ష్మి, సర్వేయర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# స్మార్ట్ టాయ్‌లెట్లు ప్రారంభం

కొలిమిగుండ్ల: కల్వటాల, కోటపాడు గ్రామాల్లో రామ్‌కో సిమెంట్ సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ టాయ్‌లెట్లను సోమవారం ఆ కంపెనీ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, అడ్మిన్ హెడ్ రామరాజు ప్రారంభోత్సవం చేశారు. మొదటి విడతలో రెండు గ్రామాల్లో ఒక్కో టాయ్‌లెట్‌కు రూ.50వేల చొప్పున 50 టాయ్‌లెట్లకు రూ.25 లక్షలు ఖర్చు చేసినట్లు యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు తెలిపారు. సొంత ఇల్లు ఉండి టాయ్‌లెట్ లేక ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి ఎంపిక చేశామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్మార్ట్ టాయ్‌లెట్లు నిర్మించామన్నారు. మిగిలిన గ్రామాల్లో దశల వారీగా చేపడుతామని చెప్పారు. మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేశారు. సర్పంచ్ కామిని సుమలత, రామ్‌కో సిబ్బంది పాల్గొన్నారు.



కల్వటాలలో టాయ్‌లెట్ల ప్రారంభోత్సవంలో రామ్‌కో ప్రతినిధులు

### భూ ఆధార్ ఉన్న రైతులకే పథకాలు

డోన్: ఆధార్ తరహాలో భూ ఆధార్(ఫార్మర్ రిజిస్ట్రీ) ఉన్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు చేసే పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి మహ్మద్ రఫీ తెలిపారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సొంత భూమి ఉన్న ప్రతి రైతు ఈ నెల 25వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఈ విషయంపై రైతులు అశ్రద్ధ చేయవద్దని సూచించారు.

### ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

డోన్: ప్యాపిలి మండల కేంద్రంలోని ఈశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి, అన్నపూర్ణేశ్వరి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మండపారాధన, రుద్రాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు చేశారు.

### 14న సంజామలలో జాబ్‌మేళా

సంజామల: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని యువకులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9705998056 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

### వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ వేధింపులకు గురి చేస్తున్నారని కోడలు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. వివరాలు.. బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన మానసకు రెండేళ్ల క్రితం పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన చిన్నమద్దయ్య, రంగలక్ష్మి దంపతుల కుమారుడు మధు కిరణ్‌తో వివాహం జరిగింది. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్త మధు కిరణ్, అత్త రంగలక్ష్మి, మామ చిన్న మద్దయ్య వేధింపులకు గురి చేస్తున్నారని కోడలు మానస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

### చెడు అలవాట్లతో జీవితం దుర్భరం



వ్యాసరచన పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

బనగానపల్లె రూరల్: చెడు అలవాట్లతో జీవితం దుర్భరంగా మారుతుందని.. వాటికి దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ యూనిట్ నోడల్ ఆఫీసర్ కౌసల్యాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ పోస్టర్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

# ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కోవెలకుంట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం కూలీలతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు వారాల నుంచి కూలీలకు వేతన బిల్లులు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే రవాణా చార్జీలు, వేసవి కాలం ప్రారంభం దృష్ట్యా పనిచేసే ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దిబ్బరాజు, రాములమ్మ, శాంతమ్మ, జయమ్మ, దేవి, హనుమంతు, బాబు పాల్గొన్నారు.

### టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

కోవెలకుంట్ల: విజయవాడలో ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని జ్యోతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గురువరుణ్‌రెడ్డి ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ నవిత్నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. విజయవాడలోని శస్త్ర కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రవేశానికి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,600 మంది విద్యార్థులు హాజరు కాగా తమ పాఠశాల విద్యార్థి మూడో స్థానం సాధించారన్నారు. విద్యార్థిని అభినందించారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

# సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బనగానపల్లె రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వెంటనే విడుదల చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సమస్యలు తెలుసుకునేందుకు అధికారులు పల్లె నిద్ర కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శౌరయ్య, మధు, చిన్న సవారి తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన నృత్య ప్రదర్శనలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా రాజస్థాన్ నుంచి తెప్పించిన సాయిబాబా పాలరాతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారుల కూచిపూడి, భరతనాట్యం చూపరులను మంత్ర ముగ్ధులను చేశాయి. విజేతలకు రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి దంపతులు బహుమతులు ప్రదానం చేశారు. వేద పండితుడు క్లై శేషావలిశర్మ ఆశీర్వదించారు.



బహుమతులు అందుకున్న చిన్నారులతో కమిటీ సభ్యులు

### డ్యాన్స్ పోటీల్లో బేతంచెర్ల బృందం ప్రతిభ

బేతంచెర్ల: సత్యసాయి జిల్లా హిందూపురంలో డీఎన్ఎస్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ జరిగిన రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీల్లో బేతంచెర్లకు చెందిన డీజే మధు డ్యాన్స్ అకాడమి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. రూ. 20వేల నగదు బహుమతి అందుకుంది. దీనిపై బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో జరగనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సోమవారం ఆయన నివాసంలో ఆహ్వానపత్రికలు అందజేశారు. ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి బీసీ ఆలయ అధికారులకు సూచించారు. బీసీ ఇందిరమ్మ, ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకులు మహేష్‌శర్మ, సత్యనారాయణశర్మ, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌలీశ్వరరెడ్డి, శంకేశ్వరరెడ్డి, రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ దంపతులు